జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః

# జయంతి

త్రైమాసిక సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక పత్రిక



సంపుటి 6 సంచిక 4 జులై - సెప్టెంబర్ 2009

త్రైమాసిక సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక పత్రిక

# జయంతి

సంపుటి 6 సంచిక 4

జూలై - సెప్టెంబర్ 2009

**సంపాదక సలహా మండలి**

శ్రీ పొత్తూరి వెంకటేశ్వర రావు (అధ్యక్షులు)

**సభ్యులు**

ఆచార్య ఐ.వి. చలపతిరావు

ఆచార్య జె. రాఘవేంద్రరావు

శ్రీ సి.హెచ్. రాజేశ్వర రావు

డా॥ జి. లక్ష్మణరావు

శ్రీమతి సుజాత గోపాల్

**జయంతి**

విడి సంచిక వెల రూ. 50/- $ 5

విశాలాంధ్ర బుక్ హౌస్‌తో సహా అన్ని

ముఖ్యమైన బుక్ హౌస్‌లలో లభించును

ముద్రణ:

శ్రీ ఉదయ్ ప్రింటర్స్

విఠల్‌వాడి, నారాయణగూడ,

**గౌరవ సంపాదకులు**

శ్రీ జువ్వాడి గౌతమరావు

**సంపాదకుడు**

డా॥ కొండల రావు వెల్చాల

**కార్య నిర్వాహక సంపాదకుడు**

డా॥ పి. సుధాకర్ రావు

**సంయుక్త సంపాదకుడు**

ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య

**కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్**

ఎస్. కవిత కుమారి

_ప్రచురణ:_

**సిస్టర్ నివేదిత ఫౌండేషన్ వారి**

**విశ్వనాథ సాహిత్య పీఠం**

11-4-654/3, రెడ్‌హిల్స్, లక్డీకాపూల్,

హైదరాబాద్ - 500 004.

ఫోన్: 23396358, 23305134

website: www.ejayanthi.com

# సాహిత్య భాష

**భాష** రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి మాములు భాష. అంటే సర్వసాధారణంగా అంతటా అందరూ మామూలు అవసరాలకు మామూలు సందర్భాల్లో మాట్లాడే "పిచ్చా పాటీ" లాంటి భాష. మరొకటి ప్రత్యేక సందర్భాలకు చెందిన విద్యా విషయాలకు, శాస్త్ర సాంకేతిక జ్ఞాన పరిజ్ఞానాలకు చెందిన పరిభాష.

ఉదాహరణకు ఫిజిక్స్‌కు చెందిన భాష 'ఫిజిక్స్'కు, 'కెమిస్ట్రీ'కి చెందిన భాష కెమిస్ట్రీకి, 'ఎకనామిక్స్'కు చెందిన భాష ఎకనామిక్స్‌కు, రాజకీయాలకు, పరిపాలనకు చెందిన భాష ఆ రంగాలకుంటుంది. అలాగే సాహిత్య రంగానికి చెందిన భాష కూడా సాహిత్యానికుంటుంది.

సాహిత్య రంగానికి చెందిన భాష మామూలు భాషకన్నా చాలా భిన్నంగా ఉంటుంది. అది ఒక విధమైన మిశ్రమ భాష. దానిలో మామూలు వాక్య నిర్మాణ భాష కొంతుంటుంది, సాహిత్యానికే చెందిన ప్రత్యేకమైన పరిభాష కొంతుంటుంది. మామూలు భాషలో సాహిత్యాన్నందించడం కుదరదు. కొంత మంది ఈ విషయం గమనించక వాడుక భాషలో, వ్యావహారిక భాషలో సాహిత్యమందించాలి, అలా అందిస్తే అది అందరికీ అందుబాటులో ఉంటుందని అంటారు. కాని సాహిత్య భాష పరిభాషా మిశ్రితం కనుక అది ఆ భాషనధ్యయనం, అభ్యాసం చేసినవారికి, దానినొక 'చదువు'గా చదివిన వారికి తప్ప ఇతరులకు అట్టే అర్థం కాదు దానిలోని పరిభాషవలన. అలాంటి సాహిత్యపరమైన పరిభాషా పదాలను ఉపమానాలు, ఉత్ప్రేక్షలు, ప్రతీకలు, నానుళ్ళు, సామెతలు, పలుకుబళ్ళు, సమాసాలు, నిర్వచనాలు, ప్రవచనాలు, శ్లేషార్థాలు, దేశీయాలు, మాండలికాలు, వృత్తిపదాలు, జానపదాలు, ఛందస్సులు, లయలు, వక్రోక్తులు, ఛలోక్తులు, హాస్యాలు, వ్యంగ్యాలు వగైరా అంటారు. అలాంటి వాటిని సందర్భాలను, సమయాలను, ఔచిత్యాలను బట్టి సాహిత్య భాషలో వాడుతారు.

సాహిత్య భాషను మరీ సులభం, సరళం, అవలీలం చేయడం అందుకే కుదరదు. సాహిత్య భాషే కాదు, ఏ ప్రత్యేక విషయపరమైన, విద్యాపరమైన భాషనైనా అలా చేయడం, కావించడం కుదరదు. ఉదాహరణకు ఫిజిక్స్ భాషను ఎలా మరీ సులభం చేయగలం అందరికీ అర్థమయ్యేట్లు? దానిలో ఎన్నో పరిభాషా పదాలు దానికి మాత్రమే చెందినవి ఉంటాయి కదా? అలాగే సాహిత్య భాషను కూడా. అలా చేస్తే అది సాహిత్యం కాక పైత్యమవుతుంది, చేపల బజారులాంటిది. అలాంటి వాసనే కొడుతుంది కూడా.

వీధిలో, అంగట్లో మాట్లాడే భాష, మాండలిక భాష, ప్రాంతీయ యాసలాంటి భాష. ఒక్కొకసారి సాహిత్యంలో ఉంటే ఉండవచ్చు ఆయా సందర్భాలను బట్టి, కాని ఆ భాష ఆయా ప్రత్యేక సందర్భాలకు సంబంధించింది మాత్రమే అవుతుంది. ప్రఖ్యాత రచయిత హెమింగ్వే తన Fisherman And The Sea నవలలో మత్స్యకారుల భాష, పడవలు నడిపించేవారి భాష చాలా వాడాడు. ఎందుకంటే అది వారి వృత్తికి, జీవనోపాధికి చెందిన నవల కనుక. అది అలాంటి సందర్భాలొచ్చినపుడు, అలాంటి విషయాలనెన్నుకున్నపుడు రచయిత చేయవలసిన పని కాని సర్వదా కాదు.

సాహిత్య భాష చాలా రసవంతమైన భాష. దానినలా తీర్చిదిద్దడానికి రచయిత ఆ భాషలో కొన్ని ఆలంకారిక పదాలు వాడవలసి ఉంటుంది. కొన్ని ఇంతవరకే ఉన్నవి, కొన్ని క్రొత్తగా సృజించుకున్నవి.

సాహిత్య భాషంటే నా అభిప్రాయంలో స – హిత భాష. అంటే, సౌందర్యంతోపాటు హితం కూడా మిళితమైన భాష. విషయమేదైనా కావచ్చు, భావం దేనికి చెందిందైనా కావచ్చు కాని ఈ భాష సౌందర్యలేమిది కాకూడదు. అది దానికి గీటురాయి, అదే దాని తురాయి. భాష ఎంత సున్నితమయినది సుకుమారమైనదైతే అభివ్యక్తి అంతా రాగమయం, లయమయం, ఛందోమయం అవుతుంది. ఒక్కొక్కసారి భావ సౌందర్యం కూడా భాషను గుభాళిస్తుంది. భాష అపుడు భావ పరిమళం ద్వారా భాసిస్తుంది, రస్మిలాంటిదై రాగం లాంటిదవుతుంది. భావం ద్వారానే భాష దాని సౌందర్యాన్ని రాబట్టుకుంటుంది. భావం మాయలాంటిదై, అదే వక్రోక్తిగా మారి రసోత్పత్తి చేస్తుంది, ధ్వనిని పుట్టిస్తుంది. ఇలాంటిది వచన కవిత్వంలో మరీ ఎక్కువ సంభవిస్తుంది.

ఆ భాష ఎలాంటిదో ఇపుడొక పుస్తకం నుండి కొన్ని పదాలు తీసికొని చూద్దాం. ఆ పుస్తకం డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తిగారు వ్రాసిన "ఆత్మ కథల్లో ఆనాటి తెలంగాణ" యనునది.

రచయిత దీనిలో ఎన్నో 'ఆత్మకథల' ఆధారంగా తెలంగాణాకు చెందిన చాలా ముఖ్యమైన విషయాలు చెబుతాడు మనకు దీని ద్వారా తెలంగాణ గురించి ఇంతకు పూర్వం తెలియని ఎన్నెన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. ఇవి 'కల్పనలు' కావు. విశిష్టులందించిన విశేషాలు. అవి వారి వారి 'ఆత్మకథల్లో' వారు పొందుపరచుకున్నవి. తెలంగాణా గురించి ఇదివరకు చాలా మంది వ్రాశారు కాని ఇందులో వ్రాసినవి తెలంగాణా యొక్క ప్రత్యేకతను విభిన్న కోణాలనుండి నిష్పక్షపాతంగా,

నిజాయితీగానే కాక నిర్మొహమాటంగా కూడా తెలియజేసేవి. (ఉదాహరణకు 'ఆధ్యాపకుల ఆత్మీయత' యను ఒక విషయ సముదాయాన్ని ఈ సంచికలో వేరుగా పొందుపరుస్తున్నాం.) దీనిని A short 'Biography of Telangana' అని కూడా అనవచ్చు. ఎందుకంటే దీనిలో ఎందరివో 'ఆత్మకథలు' నిక్షిప్తం చేసి నిఖారసుగా అందించబడినాయి ఈ పుస్తకం విషయపరంగా చరిత్రలాంటిది కాని వివరణపరంగా సాహిత్యం లాంటిది. ఈ పుస్తకాన్ని మనం చిన్నపాటి 'చరిత్ర'గా భావించవలసి ఉంటుంది. ఇది 'చరిత్ర' వ్రాసే సరిక్రొత్త పద్ధతి. ఇలా 'చరిత్ర'ను 'ఆత్మ కథల' ఆధారంగా సృష్టించిన ప్రక్రియ బహుశః ఇంత వరకు మరెవ్వరూ చేబట్టి ఉండరు. ఇలా ఏ 'నాగరికత' గురించి వ్రాసినా వ్రాసిన దానిపై, వ్రాసిన వారిపై 'విశ్వసనీయత' (Authenticity) ఎంతో పెరుగుతుంది.

ఈ పుస్తకంలో రచయిత అచటచటా అందమైన సాహిత్య భాష వాడుతాడు. ఉత్తమ సాహిత్యవేత్త కదా మరి! ఇపుడు సాహిత్య భాషంటే ఎలా ఉంటుందో తెలిసికోవడానికి ఉదాహరణగా కొన్ని పదాలు తీసికొని చూద్దాం.

1) తెలంగాణ మాట, పాట, భాష, యాస, జీవన ప్రయాస 2) బంగారు జ్ఞాపకాల గనులు 3) తటిల్లత వంటి ఆలోచన 4) జమ్ముల మర్రి వంటి హైదరాబాద్ 5) సమాజ జీవన సరిగమలు 6) బ్రతుకు పుటల బాధల సంపుటాలు 7) సాహిత్య దినుసులు 8) హుషారు కవిత్వం (ఉర్దూ) 9) శూన్య వసంతాలు 10) మబ్బుల మాటు త్యాగ కిరణాలు 11) నిశ్శబ్ద సమాజం 12) లో వెలుగులు, క్రీనీడలు 13) వెలుగు సోకని అందాల భవనం 14) జీవ భావాల శతపత్రం 15) పదిలమైన స్మృతి కెరటాలు 16) జ్ఞాన తైలం 17) సత్య వాక్య శకలాల సంకలనాలు 18) సమాచార సాగరం 19) జీవానుభవాల రాగమాలిక 20) జ్ఞాపకాల మందిరం 21) వాడిపోయినా వాసన వీడని కుసుమం 22) సత్యసాహసి 23) సార్వకాలిక సత్యం 24) అక్షర జ్యోతులు 25) కదిలే గ్రంథాలయం 26) సతతహరిత స్మరణిక 27) చందన శాఖ 28) మబ్బు చాటు వెన్నెల 29) పత్రికా దీపం 30) కౌముదీ కాంతులు. 31) దారి దివిటీలు 32) విరామ చిహ్నాలు 33) దాతల కైవారాలు

ఇవి వచనంలోనివి. కవితల్లోనైతే మరెన్నో పరిమళమైన పదాలు లభిస్తాయి. ఇలాంటి పదాలు, వాక్యాలు వాడుటకు, సృష్టించుటకు ఉత్తమ భాషా పరిచయం, భావ పరిచయం, అధ్యయనం, అభ్యాసం చాలా అవసరం. అంతేకాదు సౌందర్యాభిరుచి, సంగీతాభిరుచి కూడా.

సాహిత్య రచయితలు ఇలాంటివెన్నో అందమైన పదాలు వాడుతారు. ఆ రంగానికి చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, జర్నలిస్ట్‌లు మున్నగువారే కాక ఇతరులు కూడా అందమంటే ఏమిటో తెలియాలంటే అందంగా వ్రాయాలంటే, మాట్లాడాలంటే మంచి పుస్తకాలు విరివిగా చదవాలి. దాని వలన వారి అభివ్యక్తి కౌశలాలు ఎంతో అభివృద్ధి చెందడంతోపాటు వారి భావ వైశాల్యత కూడా ఎంతో పెరుగుతుంది. సభ్యసమాజం వారికి ప్రతిభావంతులు, మేధావులు, సృజన శీలురని పెద్దపీట వేస్తుంది. వారికి వృత్తిపరమైన అభివృద్ధే కాక సమాజంలో ఎంతో గుర్తింపు వస్తుంది, ఆర్థికాభివృద్ధితోపాటు హృదయానందం, ఆత్మానందం కూడా లభిస్తుంది.

'చరిత్రలు' వ్రాసేవారు, బోధించేవారు వాటిని కేవలం సమాచారాలుగా, వృత్తాంతాలుగా కాక పాఠకుల్లో రుచి అభిరుచి పుట్టించుటకు ముచ్చటగా, కథలుగా, గాథలుగా వ్రాయాలి, బోధించాలి. Will Durant అనే ఒక గొప్ప రచయిత Story of Philosophy అను ఒక పుస్తకం వ్రాశాడు. అది వచనమేకాని కవిత్వంలా ప్రవహిస్తుంది. భాషా భావాలు ఎంతో అందంగా ఉంటాయి. అలా 'దార్శనిక', 'తాత్విక' విషయాలు చెప్పడం, బోధించడం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. అలాగే C.E.M. Joad యను రచయిత కూడా 'నాగరికత' గురించి Story of Civilization అను గ్రంథం "సంభాషణల్లో" వ్రాశాడు. అది కూడా విషయాన్ని విచిత్రంగా అందించిన పుస్తకమే. నాగరికత గురించి చరిత్రకారులు ఇతర విధాలుగా ఎంత వ్రాసినా అవి అతడవలంబించిన విధానమంత ఆకర్షణీయంగా ఉండవు. అలా సంభాషణల్లో చెప్పబడింది ఒక కథ చెప్పినట్లుగా ఉండి చాలా సులభంగా అర్థమవుతుంది కూడా.

మన విద్యా విధానంలో, మరీ బోధనా విధానంలో ఒక పెద్ద లోపముంది. అది పాఠాలను కథలుగా మలచి వ్రాయకపోవడం చెప్పకపోవడం. అలా వాటిని చెప్పడం, వ్రాయడం చేతకాక మనవారు అటు విద్యను చంపుతున్నారు, ఇటు విద్యార్థుల జిజ్ఞాసను చంపుతున్నారు. తద్వారా సామాజిక అభివృద్ధిని, అభ్యున్నతిని, ప్రగతిని కూడా. అలా చేయడం వలన, మనం శాస్త్రాలను పెంచుతున్నాం కాని శాస్త్రీయ దృష్టిని వలసినంత పెంచడం లేదు, సాంఘిక శాస్త్రాలను పెంచుతున్నాం కాని సాంఘిక దృక్పథాన్ని వలసినంత పెంచడం లేదు, మానవీయ శాస్త్రాలను పెంచుతున్నాం కాని మానవతా భావాన్ని వలసినంత పెంచడం లేదు. అలాంటి పరిస్థితిని అరికట్టాలంటే మనకు డా. గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తిలాంటి విషయాలను, విద్యలను, పాఠాలను కథలుగా, గాథలుగా, ఇంపుగా సొంపుగా వ్రాయగల, చెప్పగల ఆచార్యులు, ఆధ్యాపకులు, రచయితలు ఇతోధికంగా కావాలి. అలాంటి వారిని సంస్థలు, సమాజాలు, పరిపాలకులు ప్రోత్సహించాలి. వారిచే నవ రచయితలకు, ఆధ్యాపకులకు, బోధకులకు శిక్షణ ఇప్పించాలి.

– **డా. వెల్చాల కొండలరావు,** జయంతి సంపాదకులు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=794**

* * *

**Read Jayanthi Magazines @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=163**